క్లుప్తంగా

జగనన్న కాలనీల్లోని ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు

ఎమ్మిగనూరురూరల్: జగనన్న కాలనీల కోసం ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలకు నేటి నుంచి రిజిస్ట్రేషన్లు చేయించనున్నట్లు తహసీల్దార్ ఆంజనేయులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలో 4105 మంది లబ్ధిదారులు ఉన్నారని, ఇందులో 3182 మందికి ప్లాట్ మ్యాపింగ్ ఇవ్వగా, 2858 మంది బౌండిర్స్ నమోదు చేసి రిజిస్ట్రేషన్‌కు సిద్ధం చేసినట్లు చెప్పారు. ట్రైల్ రన్‌గా ఒకరోజు నిర్వహించామని నేటి నుంచి రెగ్యూలర్‌గా రిజిస్ట్రేషన్లు జరుగుతాయన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చురుగ్గా కులగణన

ఆలూరు రూరల్: మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలో కులగణన సర్వే చురుగ్గా సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేలో భాగంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబసభ్యుల వివరాలు నమోదు చేస్తున్నారు. సోమవారం నాటికి 78 శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. మండలంలో మొత్తం 10,558 కుటుంబాలు 56,238 మంది జనాభా ఉన్నారు. కులగణన ద్వారా ప్రజల జీవన విధానం, ఆర్థిక, సామాజిక స్థితిగతులు తెలుస్తాయని అధికారులు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


బాధితుడు వన్నూరప్పకు రూ.15 వేలు సాయం అందిస్తున్న బుసినె శ్రీరాములు

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో వన్నూరప్పకు చెందిన గుడిసె ప్రమాదవశాత్తు మంటల్లో దగ్ధమైంది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుసినె విరూపాక్షి సోదరుడు శ్రీరాములు సోమవారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారికి తమవంతుగా రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలను ఆదుకునేందుకు ముందుంటామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దిబ్బలింగ, బసవరాజు, కాళిదాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి సుంకులమ్మ దేవర


సుంకులమ్మ మూలవిరాట్

మద్దికెర: మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలో సుంకులమ్మ దేవి గ్రామ దేవర రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు గ్రామ ప్రజలు తెలిపారు. మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు సాయంత్రం దున్నపోతు ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 31వ తేదీ బుధవారం ఇంటింటి నుంచి బోనాలతో ఊరేగింపు నిర్వహించి ఆలయ ప్రదక్షిణల అనంతరం అమ్మవారికి పూజలు చేయడం జరుగుతుందన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


పట్టుబడిన మద్యంతో ఆలూరు పోలీసులు

ఆలూరు రూరల్: అక్రమంగా దాచి ఉంచిన కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆలూరు ఎస్‌ఐ ఓబులేసు తెలిపిన వివరాలు.. ముందుగా అందిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం మండలంలోని మొలగవల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లోని గడ్డి వాములు తనిఖీ చేసి 11 బాక్సులు (1,096 టెట్రా ప్యాకెట్లు, 90 ఎంఎల్) కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. మద్యం దాచి ఉంచిన నిందితులు పరారీలో ఉన్నట్లు చెప్పారు. దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేస్తామన్నారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది నవీన్, గిరి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

ఆలూరు: ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు ప్రతిపక్ష టీడీపీ నేతల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరూపాక్షి పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఆయన సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులపై కరపత్రాలను విడుదల చేశారు. పార్టీ నాయకులు కరపత్రాలను ఇంటింటికీ అందించి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

గ్రామ పంచాయతీలకు నిధుల విడుదల

- 20 గ్రామ పంచాయతీలకు రూ.1.50 కోట్లు మంజూరు
- ఖాతాల్లో నగదు జమ
- తాగునీరు సరఫరా, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులకు ఉపయోగం


గోనెగండ్ల గ్రామ పంచాయతీ కార్యాలయం

గోనెగండ్ల: గ్రామ పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటికి రూ.1,50,08,599 మంజూరయ్యాయి. ఈ మొత్తం ఇప్పటికే పంచాయతీల ఖాతాల్లో జమయ్యాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్స్, నాడు–నేడు కింద పాఠశాలల అభివృద్ధి, అవసరమైన చోట సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పుడు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడంతో గ్రామాలు మరింత ప్రగతి సాధించేందుకు ఆస్కారముంది. ఆర్థిక సంఘం నిధుల్లో కొంత గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంది. మిగిలిన వాటితో సర్పంచ్‌లు పంచాయతీ తీర్మానం మేరకు గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేపడతారు. తాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ, పారిశుద్ధ్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు తదితర అవసరాలకు ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవచ్చు.

అభివృద్ధి పనులకు ఉపయోగించాలి



మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు కలిపి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,50,08,599 మంజూరయ్యాయి. ఆ నిధులను గ్రామంలో అభివృద్ధి పనులకు ఉపయోగించాలి. తాగునీరు, పారిశుద్ధ్యం పనులతో పాటు కొంత సొమ్మును పంచాయతీల విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంది. మిగతా సొమ్ముతో గ్రామ పంచాయతీల తీర్మానంతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలి. అన్ని గ్రామాల సర్పంచులు ఆయా గ్రామాలకు మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలి.

– ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ, గోనెగండ్ల

ఆస్పరి మండలంలో విడుదలైన నిధులు ఇలా..

ఆస్పరి: మండలంలోని 21 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,39,87,584 మంజూరైనట్లు ఈఓఆర్‌డీ సూర్యనరసింహారెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మంజూరైన ఆర్థిక సంఘ నిధులను పారిశుద్ధ్య కార్మికుల జీతాలు, విద్యుత్ బిల్లులు, పారిశుద్ధ్యపు పనులు, మంచి నీటి సౌకర్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం, వీధిదీపాల కోసం వినియోగించుకోవాలన్నారు. పంచాయితీల వారీగా మంజూరైన నిధుల వివరాలు ఇలా ఉన్నాయి. మేజర్ గ్రామ పంచాయితీ ఆస్పరికి రూ.15,23,074, అట్టికల్లుకు రూ.4,01,822, బనవనూరుకు రూ.4,84,302, బిల్లేకల్లుకు రూ.5,24,727, బిణిగేరికి రూ.4,93,336, చిగిళికి రూ.6,08,548, చిన్నహోతూరుకు రూ.7,85,349, చిరుమాన్‌దొడ్డికి రూ.3,15,615, డీకోటకొండకు రూ.4,80,863, హలిగేరకు రూ.6,85,861, జొహరాపురంకు రూ.10,35,858, కారుమంచికి రూ.7,85,536, కై రుప్పలకు రూ.10,25,824, ములుగుందంకు రూ.13,17,833, ముత్తుకూరుకు రూ.5,47,897, నగరూరుకు రూ.7,17,610, పుటకలమర్రికి రూ.3,11,173, శంకరబండకు రూ.3,69,824, తంగరడోణకు రూ.9,61,100, తొగలుగల్లుకు రూ.2,67,460, యాటకల్లుకు రూ.3,43,972 నిధులు మంజూరైనట్లు చెప్పారు. అంతేగాకుండా మండల పరిషత్‌కు రూ.30 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. ఈ నిధులను గ్రామాల అభివృద్ధి కోసం వినియోగించాలన్నారు.

గోనెగండ్ల మండలంలో గ్రామ పంచాయతీల వారీగా విడుదలైన నిధులు

గ్రామం పేరు	–	మంజూరైన నిధులు (రూ.)
అలువాల	–	739242
బి. అగ్రహారం	–	475190
బైలుప్పల	–	610472
చిన్నమరివీడు	–	508272
ఎర్రబాడు	–	437806
గాజులదిన్నె	–	404812
గంజిహళ్లి	–	892927
గోనెగండ్ల	–	3234095
హెచ్.కైరవాడి	–	1156655
ఐరన్‌బండ	–	418060
కులుమాల	–	680194
కున్నూరు	–	497934
ఎస్.లింగందిన్నె	–	252954
నెరుడుప్పల	–	503397
ఒంటెడుదిన్నె	–	328223
పెద్దమరివీడు	–	796514
పెద్దనేలటూర్	–	1222975
పుట్టపాశం	–	407410
తిప్పనూరు	–	760641
వేముగోడు	–	680826
మొత్తం	–	1.50.08.599

నేడు పోతుగల్లులో సురక్ష వైద్య శిబిరం

కృష్ణగిరి: మండల పరిధిలోని పోతుగల్లు గ్రామ సచివాలయం ఆవరణలో మంగళవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి ప్రదీప్ సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలందరూ ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారందరూ శిబిరానికి వస్తే స్పెషలిస్ట్ వైద్య బృందంచే ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందిస్తారని ఆయన వెల్లడించారు.

సద్వినియోగం చేసుకోండి

చిప్పగిరి: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కొండయ్య ప్రజలకు సూచించారు. సోమవారం మండలంలోని నంచర్ల గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైస్ ఎంపీపీ నరసింహులు, సర్పంచ్ భీమ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ప్రజా సంక్షేమం

ఆలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించారని వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కొత్త కాపు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం హాలహర్వి మండలం గూళ్యం, బాపురం, పచ్చార్లపల్లి, హాలహర్వి, ఆలూరు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆలూరులో మాట్లాడుతూ.. నవరత్నాల పథకాల ద్వారా పేదలందరికీ లబ్ధి చేకూరిందని వివరించారు. సంక్షేమ పథకాలు అభివృద్ధి కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అఖండ విజయం అందించాలని పిలుపునిచ్చారు. ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు తదితరులు వెంట ఉన్నారు.

సహకార సొసైటీలతో రైతులకు సేవలు


సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తున్న కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ విజయ మనోహరి, మల్లికార్జున తదితరులు

హొళగుంద: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) ద్వారా రైతులకు రుణాలు, ఇతర మెరుగైన సేవలు అందుతున్నాయని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విజయ మనోహరి అన్నారు. సోమవారం సింగిల్ విండో చైర్మన్ వందవాగిలి మల్లికార్జున అధ్వర్యంలో హొళగుంద సమీపంలోని శ్రీరాంనగర్ క్యాంపులో అప్కాబ్ రుణ సాయంతో పాటు సొసైటీ భాగస్వామ్యంతో నిర్మించిన పీఏసీఎస్ నూతన కార్యాలయ భవనాన్ని ఆమె ప్రారంభించారు. అలాగే స్ట్రాంగ్‌రూంతో పాటు బస్టాండు సమీపంలోని సుళువాయి రోడ్డులో ఏర్పాటు చేసిన జన ఔషధి దుకాణాన్ని ప్రారంభించారు. అంతకుముందు సొసైటీ భవనం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. హొళగుంద సొసైటీని అభివృద్ధి చేస్తూ రైతులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్న సొసైటీ చైర్మన్ వందవాగిలి మల్లికార్జున, సీఈఓ నీలకంఠ స్వామి, సిబ్బందిని అభినందించారు. సొసైటీలో గోల్డ్ లోన్‌లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టామని, అలాగే రైతులు పండించిన దిగుబడులను నిల్వ చేసేందుకు గోడౌన్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అలాగే నాణ్యమైన జనరిక్ ఔషధాలను సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జన ఔషధి దుకాణంలో తక్కువ ధరకే పొందవచ్చన్నారు. సింగిల్ విండో చైర్మన్ వందవాగిలి మల్లికార్జున, సెక్రటరి నీలకంఠయ్య స్వామి (సీఈఓ), జెడ్పీ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, ఈశా, కోగిలతోట శేషప్ప, పంపాపతి, ఎంపీటీసీ మల్లికార్జున, హనుమప్ప, ఎస్కే గిరి తదితరులతో పాటు కేడీసీసీ డీసీఓ, సీఈఓలు రామాంజనేయులు, అప్కాబ్ ఏజీఎం సాహిదా సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లార్తి దర్గాలను దర్శించుకున్న కేడీసీసీబీ చైర్‌పర్సన్

హొళగుంద: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాలను సోమవారం కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ విజయ మనోహరి దర్శించుకున్నారు. దర్గా నిర్వాహకులు ఆమెకు స్వాగతం పలికి ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. వస్త్రాలు, ప్రసాదాలను అందజేయగా ఆమె కొద్దిసేపు దర్గాలోనే గడిపారు. అనంతరం దర్గా సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు.

నేడు వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమావేశం

చిప్పగిరి: మండల కేంద్రంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుసినె విరూపాక్షి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు కన్వీనర్ జూటూరు మారయ్య తెలిపారు.

నేడు ప్రారంభోత్సవం


వెల్దుర్తిలో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల కేంద్రంలో నిర్మించిన పలు కార్యాలయ భవనాలను ప్రారంభించేందుకు 30వ తేదీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వెల్దుర్తికి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి తెలిపారు. పట్టణంలోని 2వ వార్డులో రూ.43.60 లక్షలతో పూర్తి చేసిన సచివాలయం-2 నూతన భవనం, 15వ వార్డులో వీరన్న గట్టు కొండ సమీపంలో రూ.20.80 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్-3 నూతన భవనం, కర్నూలు రోడ్డులో సొసైటీ పక్కన రూ.18 లక్షలతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనాన్ని ఆమె ప్రారంభించనున్నట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు గ్రంథాలయ భవన ప్రారంభోత్సవం


సచివాలయం-2 నూతన భవనం


గ్రంథాలయ భవనం

వెల్దుర్తిలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, లైబ్రేరియన్ కవితాబాయ్,గ్రంథాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ తిరివీధి సాయి ప్రసాద్ తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, సెక్రటరీ ప్రకాశ్ తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు.

క్రీడా మైదానాలు కళకళ


బాలికల హైస్కూల్ మైదానంలో తలపడుతున్న కబడ్డీ క్రీడాకారులు

ఎమ్మిగనూరుటౌన్: శ్రీ నీలకంఠేశ్వర స్వామి జాతర మహోత్సవం సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణంలో రాష్ట్ర స్థాయిలో పలు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ అంతర్రాష్ట్ర స్థాయి వృషభాల బండలాగుడు పోటీలు, ఫుట్‌బాల్, వాలీబాల్, షటిల్, పురుష కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఆర్గనైజర్లు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే దాదాపు నెల రోజులకు పైగా నిర్వహించిన క్రికెట్ టోర్నీ ముగియగా మిగతా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రాష్ట్రం నుండే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన జట్లు క్రీడల్లో పాల్గొంటున్నాయి. గెలుపొందిన జట్లకు భారీగా నగదు బహుమతులు ఉండటంతో క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతున్నారు. అదేవిధంగా ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు 32 జట్లు వచ్చాయి. వాలీబాల్ పోటీలకు 30 జట్లు, కబడ్డీ పోటీలకు 40 జట్లు, షటిల్ బ్యాడ్మింటన్‌కు 30 జట్లు వచ్చాయి. ఆయా పోటీలను తిలకించేందుకు అధిక సంఖ్యలో జనం తరలివస్తున్నారు. దీంతో క్రీడామైదానాలు కళకళలాడుతున్నాయి. ఆర్గనైజర్లుగా బీఆర్ బసిరెడ్డి, భీమిరెడ్డి, నజీర్‌అహమ్మద్, పాలశ్రీనివాసరెడ్డి విశ్వనాథ్‌రమేష్, బాబాఖాన్, రామకృష్ణ తదితరులు వ్యవహరిస్తున్నారు. పట్టణ సీఐ మధుసుదన్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

పకడ్బందీగా కులగణన సర్వే


కృష్ణగిరిలో కులగణన సర్వేను పర్యవేక్షిస్తున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

కృష్ణగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి ఆదేశించారు. కృష్ణగిరిలో సోమవారం ఆయన కులగణన పూర్తయిన కుటుంబాల వివరాలను ర్యాండమ్‌గా పరిశీలించి కుటుంబసభ్యులతో మాట్లాడారు. అన్ని కులాలకు సామాజిక న్యాయం జరిగేలా ప్రభుత్వం చేపట్టిన సర్వేలో నిర్లక్ష్యం తగదన్నారు. మండలంలో ఇప్పటి వరకు 80 శాతం సర్వే పూర్తయిందని మిగిలిన 20 శాతం త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వలస వెళ్లిన కుటుంబాలకు ఓటీపీ ద్వారా సర్వే చేయాలని సూచించారు. మండలంలో కురువ కులస్తులు తమను మాదాసి కురువలుగా నమోదు చేయాలని కోరారని, ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతామన్నారు. ఎంపీడీఓ రామస్వామి, ఈఓఆర్డీ మురళీమోహన్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌మూర్తి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

షటిల్ విజేతలకు బహుమతులు


విజేతలకు ట్రోఫీలు అందజేసిన దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన డివిజన్ స్థాయి మెన్స్ డబుల్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. ఈ పోటీల్లో 40 సంవత్సరాల పైబడిన విభాగంలో డబుల్స్ జట్టు రామకృష్ణ, జగదీష్ విజేతగా నిలవడంతో వారికి తహసీల్దార్ ఆంజనేయులు, రూరల్ సీఐ మోహన్‌రెడ్డి రూ.10 వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీని సోమవారం అందజేశారు. రెండవ స్థానంలో ఉదయ్, ఆనంద్ జట్టు, మూడవ స్థానంలో ఆలూరుకు చెందిన ఖాజ, జిలాన్ జట్టు, నాలుగవ స్థానంలో చిరంజీవి, ఫారుక్ జట్లు నిలిచాయి. అలాగే ఓపెన్ జట్ల పోటీల్లో మొదటి స్థానంలో రామకృష్ణ, జగదీష్, రెండవ స్థానంలో చరణ్, వాత్సవ్ జట్టు, మూడవ స్థానంలో ఆదోనికి చెందిన మనోజ్, ఖాశీం జట్టు, నాల్గవ స్థానంలో గోవర్ధన్, గౌరవ్ జట్లు నిలిచి నగదు బహుమతులు అందుకున్నాయి. నిర్వాహకులు పి.శ్రీనివాసరెడ్డి, అనీల్‌కుమార్, చంద్రబాబునాయుడు, రఘురాం, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన


నందవరంలో మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ ఉప సంచాలకులు శ్రీనివాసులు

నందవరం: ఉద్యాన శాఖ అందించే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు ఉద్యాన శాఖ ఉప సంచాలకులు శ్రీనివాసులు సూచించారు. సోమవారం నందవరంతో పాటు కే.పేట, కనకవీడు గ్రామాల్లో మిరప, బొప్పాయి, డ్రాగన్‌ఫ్రూట్ తోటలను మండల ఉద్యాన శాఖ అధికారిణి శ్రీవాణి ఆధ్వర్యంలో పరిశీలించారు. కనకవీడు గ్రామంలో ధాన్యం నిల్వ కోసం ఏర్పాటు చేస్తున్న గోడౌన్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తోందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, వీఏఏ త్రివేణి తదితరులు ఉన్నారు.

ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే లక్ష్యం

నందవరం: జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామని ఎంపీడీఓ దశరథ రామయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాముడు పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులతో 'హర్ ఘర్ జల్ పథకం'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. జలజీవన్ మిషన్ కింద మండలానికి రూ.12 కోట్లు మంజూరయ్యాయన్నారు. ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా పొదుపు మహిళలతో పనులు చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనులను గ్రామ సర్పంచులు పర్యవేక్షించాలన్నారు. గణాంకాల అధికారి సూర్యప్రకాష్, పరిపాలనాధికారి కృష్ణమూర్తి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

31న పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం

హొళగుంద: రానున్న ఎన్నికల్లో ఆలూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని ఆ పార్టీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు స్పష్టం చేశారు. సోమవారం హొళగుందలో మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు కోగిలతోట శేషప్ప, ఎంపీటీసీ మల్లికార్జున, ఎస్కే గిరి తదితరులు విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 31న హొళగుందలో పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి వస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని పిలుపునిచ్చారు. నాయకులు రామకృష్ణ, సోమిరెడ్డి, పంపాపతి, దొడ్డబసప్ప తదితరులు పాల్గొన్నారు.

గతుకుల మార్గంలో సీసీ రోడ్డు


నేడు - బొమ్మనపల్లిలో రూ.4.43 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు


నాడు - గతుకులమయంగా ఉన్న రోడ్డు

మద్దికెర: మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలో గుంతలమయంగా ఉన్న దారిలో సచివాలయ నిధులు రూ.4.43 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గ్రామ పర్యటనకు వచ్చినపుడు స్థానికులు సమస్యను వివరించి సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. ఎమ్మెల్యే చర్యలు చేపట్టి ప్రస్తుతం రోడ్డు వేసి సమస్యను పరిష్కరించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గోనెగండ్లలో రైతు సదస్సు

గోనెగండ్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో సోమవారం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఆధ్వర్యంలో జేసీ దివాకర్ రెడ్డి వ్యవసాయ కళాశాల అనంతపురానికి చెందిన వ్యవసాయ విద్యార్థినులు రైతు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రి మాట్లాడుతూ.. వ్యవసాయ కళాశాల విద్యార్థినులు రైతులతో కలిసి చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ పి.సుజాతమ్మ మాట్లాడుతూ.. సమతుల ఎరువుల వినియోగం, వీలైనంత వరకు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడటం, భూసార పరీక్షలు తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే పంటల సాగులో మెలకువలను వివరించారు. విద్యార్థినులు సమీకృత వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం, హైడ్రోఫోనిక్స్ ద్వారా సాగు, వర్షపు నీటిని ఆదా చేయడం, నీటి కుంటలు, నానో ఎరువులు తదితర వాటిపై ప్రదర్శన నిర్వహించారు. సీనియర్ అగ్రానమిస్ట్ శ్రీధర్ రెడ్డి, కేవీకే విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ టీ.శ్రీచందన, సహాయ ఆచార్యులు డాక్టర్ లక్ష్మిదేవి, రైతులు, విద్యార్థినులు పాల్గొన్నారు.